# ధర్మసాధని

[బ్రహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

సంపుటము ౮.

సంచిక ౨౦.

14 1921

కాకినాడ:—శనివారము, ౧౪, మే, ౧౯౨౧.

చందా సం॥ రు. 3

విడిసంచిక అ ౧.


## ఓమ్.

### హారతి.

గగన విశాల పాత్రిమున
 గ్రాలగ జ్యోతులు చంద్రభాస్కరుల్
సొగసగు ముత్తెముల్ వగిది
 జుక్కలు శోభిల గమ్మ తెమ్మెరల్
నెగడగ జామరమ్ములుగ
 నిండుగ విచ్చిన పూలు చెట్లలో
నిగనిగ లీన ధూపములు
 నివ్వెఱ మోగియ స్వయమ్ముగా సదా
యగణిత వైఖరిం జెలగు
 హారతి నీకు ద్రిలోక నాయకా.

(మాతృక:–గగన వేథాల రవిచంద్ర దీపకవనే । తారక మండల జోకాంకా మోతీ । ధూపమల యానిలో పవన చమరో కరే । సకల వనరాజి ఫ్రాలన్త జ్యోతి । కైసీ ఆరతి హోతే భవఖండనా తేరీ ఆరతి । అనహతా శబ్ద బాజన్త భేరీ॥)

పాపములెల్ల బోదలచి
 భావమునన్ బరిశుద్ధ భక్తియన్
దీపము వెల్గజేసి భవ
 దీయదయామృతవృష్టి చేత నా
తాపము లెల్ల దీర్చి నను
 ధన్యుని జేయుమటంచు వేడి నీ
పాద్రునను జేరినాడను
 గృపాగుణ భూషణ భక్తపోషణా.

---

## కులీనత.

—:o:—

### గీతములు.

అతని కులమును గూర్చి నే నడుగ బోను
అతని పేరును గూర్చి నే నడుగ బోను
మానవోచిత ధైర్యమ్ము మదిని నున్న
నతడె సత్కులు డనబడ నర్హు డగును.

మించు నిహసంపదల బట్టి యెంచి చూడ
గొలదివాడుగ నుండిన గొదువ నేయ
నతనిమది కేవల దయార్ద్ర మైనయదియె?
యనుచు నడిగిన యపుడు నీ వవునటంచు
జెప్పగలిగిన జాలును దప్పకుండ
నతడు సత్కులు డనబడ నర్హుడగును.

అతడు పుట్టిన దేశ మే దైన నేమి?
అతడు పెరిగిన దేశ మే దైన నేమి?
అమల చారిత్రు డయియున్న నదియె చాలు!
ప్రవిమలంబుగ నొప్పారి పారె నేని
నెచట బుట్టిన నేమి యా యేరు చెపుము!

అతడు జన్మంబు గాంచిన దంతిపురము?
ఆకుటిల్లా? యటంచు నిన్నడుగ బోను
అతడు విశ్వాస పాత్రుడా? యనుచు నిన్ను
నడుగుటకు నుత్తరము చెప్ప మదియె చాలు!

NICOL.]

ఆ. సోమనాథరావు.

---

# భారత జాతీయత.

—— :o: ——

[శ్రీ రవీంద్రనాథ ఠాకూరు గారు.]

## VII

మన సాంఘిక ఆధ్యాత్మిక విషయములలో జరుగవలసిన పని యంతయు మనము పుట్టక పూర్వము అనేక వేల సంవత్సరములకు పూర్వమే మన పూర్వులచే చేసి వేయబడినదనియు నా విషయమున మనము చేయదగిన దేదియును లేక పోవుటచే మన మెక్కువ స్వేచ్ఛతో రాజకీయ విషయములలో పని చేయవలసిన సమయమిదియనియు హిందూదేశములోని ప్రస్తుతపు జాతీయవాదులలో చాలమంది యొక్క అభిప్రాయము. తమ యొక్క దివ్యదృష్టిచేతను, ఆధ్యాత్మిక బలము చేతను మన పూర్వులు రాబోవు సంతతికి కూడ సరిపడునట్టి సాంఘిక యేర్పాటులను చేసి వేసిరనియు, అవియే చెక్కు చెదరక నిలిచి యుండవలయు ననెడు విశ్వాసమే మన జాతీయతకు మూల బీజముగా నంగీకరించుట చేత, మన అసహాయ స్థితికి కారణభూతమైన సాంఘిక దుస్థితిని కలలోనైనను గుర్తింపము. కాబట్టి మన దుఃఖములకును దైన్యస్థితికిని పరదేశముల నుండి వచ్చిన దండయాత్రలే కారణము లని వేయినోళ్ల చెప్పుకొనుచుందుము. ఈ కారణము వలననే సాంఘిక బానిసత్వమనే యీయిసుక యెడారిలో రాజకీయ స్వాతంత్ర్యమను విచిత్ర సౌధమును నిర్మించుట యొక్కటే మన పని యని యనుకొనుచుందుము. మన దేశ జీవిత ప్రవాహమునకు అడ్డగట్టు వేసి యితరజాతుల యొక్క చరిత్రనుండి మనము శక్తిని సంపాదింపజూచుకొనుచున్నామనుట మాత్రము వాస్తవము.

రాజకీయ స్వాతంత్ర్యమే హిందూదేశము నందలి ప్రజల యొక్క దాస్యభావమును తొలగజేయునను మహాభ్రమను లోనయిన భారత జాతీయవాదు లందరును ఈ తత్వమును పాశ్చాత్యదేశములనుండి గ్రహించి, యిదే పరమ సత్యమని అనుకొనుచు, మానవ స్వభావమునందు విశ్వాసమును కోల్పోవుచున్నారు. కాని సంఘమునందు నేయే బలహీనతలు ప్రవేశపెట్టుదుమో, అవి అన్నియు రాజకీయ వ్యవహారములందు మన కాళ్లను సంకెలలయి తగులుకొనునను విషయమును మనము మరువగూడదు. ఏ జడత్వము మూలమున సాంఘిక ప్రతిష్ఠాపనములలో మనము గ్రుడ్డితనముగా ప్రాణ విహీనములయిన దురాచారములను పూజించుచుందుమో, ఆ జడత్వమే రాజకీయ విషయములందు గూడ, మనము తప్పించుకొనజాలని కారాగారములను మన కొరకు నిర్మించుచునే యుండును. ఏ సానుభూతి రాహిత్యము, ఏ నిర్దాక్షిణ్యత, మానవులలో కొందరిని తక్కువ వారని తలచుచు పశువులకంటె గూడ నన్యాయముగ జూచుట, మనకు నేర్పినదో ఆ నిర్దాక్షిణ్యతయే రాజకీయ విషయములందు కూడ మనలను విడువక అన్యాయ ప్రవర్తనులు గను, నిరంకుశాధికారులు గను జేయుననుటకు సందియము లేదు.

మన జాతీయవాదులు ఉన్నతాదర్శములను గూర్చి మాట్లాడునప్పుడు జాతీయత అను దానికి పునాదియే లేదను సంగతిని మరచుచుందురు. ఈ ఉన్నతాదర్శములను పైకి ఎక్కువగా కనబరచు మహనీయులే తమ సంఘ అలవాట్లలో చాల కఠినులుగా నుండి, యే మాత్రము ఉదారభావమును పరులయెడల చూపరు. మీదు మిక్కిలి „ చూడుడు స్విట్జర్లండును. ఎన్ని జాతుల వారో కలరు. ఎన్ని భేదములో కలవు. అయినను వారందరును ఏకజాతి క్రింద కాలేదా ” యని యీ జాతీయవాదులు పలుకుచుందురు. కాని స్విట్జర్లండులో నుండెడు వారందరును, ఏకరక్తమునకు చెందినవారనియు, ఎన్ని భేదము లుండినను అంతర వివాహములాడుటకును ఒక తెగవారు మరియొక తెగవారితో కలియుటకును, అవకాశములను, స్వాతంత్ర్యములను కలిగియున్నారనియు జ్ఞాపక ముంచుకొనవలెను. హిందూదేశములో అందరకును సమానమైన జన్మహక్కు లేదు. మనము పాశ్చాత్యజాతులను గూర్చి మాట్లాడునప్పుడు మన దేశములలో ఒక కులమునకును మరియొక కులమునకును మధ్యనుండు దాట శక్యముగాని అంతరము, పాశ్చాత్య జాతులలో నొక తెగకును మరియొక తెగకును నడుమ లేదను సంగతిని మరచుచుందుము. ఏ డబ్బు కొరకో తప్ప. రక్త సంబంధములేని జాతు లెక్కడనైనను ప్రేమతో ఒకరి కొరకొకరు రక్తమును ధారపోసిన యుదాహరణ ప్రపంచములో నెక్కడనైనను గలదా? దుర్నీతికరములైన యీ సాంఘిక కట్టుబాట్లు, ఈ కుల విభేదములు, మన రాజకీయ ఐకమత్యమునకు భంగము కలిగింపవని మనము తలచుట కవకాశములు గలవా?

మన సాంఘిక అడ్డంకులు మనలను పిరికివారలనుగ మార్చివేయ గలిగినంత నిరంకుశాధికారమును ఇంకను మనపై నెరపుచునే యున్నవను విషయమును మాత్రము మనము గుర్తించి తీరవలెను. తనకు ఉదారమైన నవీనాభిప్రాయములు కలవనియు, సంఘ బహిష్కారమునకు వెరచి తాను ఆచరించలేననియు ఏ మనుష్యుడైనను చెప్పిన యెడల, తనకు జీవింపదగిన సజ్జీవితము కలదని గుర్తించి, తన పిరికితనముచే నట్లు జీవింపజాలక ద్వంద్వ జీవితమును గడుపుచున్నను, నే తిరస్కరింపను. ఏ ఆహార స్వీకారములోనో మనతో నేకీభవింపక, భేదము గల మన [illegible]డి దేశీయులను న్యూనపరచి వారి జీవితము వారికే దుఃఖబహుళమగునట్లు చేయుచున్న మన సాంఘిక అలవాట్లు మన రాజకీయ ప్రతిష్ఠాపనములలో గూడ ప్రవేశించి క్రమమైన భేదములను రూపుమాప సమర్థమైన పరిస్థితులు దేశమున ఉద్భవిల్లునట్లు చేసితీరును. మన రాజకీయ జీవితమునందు నిరంకుశమునకు తోడు అనివార్యమైన అసత్యములు కపటభావములు కూడ వెల్లివిరియును. ఆ నామమాత్ర స్వాతంత్ర్యమునందు మన నైతిక స్వాతంత్ర్యమును గూడ దానికొరకు గంగను కలిపి వేయ గలిగినంత మాధుర్యము కలదా?

త. న. శ.

——

# విశ్వాస విజృంభణము.

—:o:—

అజ్ఞానదశయందు విశ్వాసము మెండుగా నుండును. చూడుడు, ఎట్టి అసంగత చర్యలను చెప్పినను బాలు రెట్లు విశ్వసించునో. వ్యక్తి విషయమునం దెట్లో సంఘముల విషయమునను అట్లె. బాల్యావస్థయందు సంఘములును యుక్తి యుక్తములు గాని అనేక విషయములను పరిశీలింపక నమ్ముచుండును. కాని జ్ఞానోదయ మైనంతనే సంశయము లనేకములు మనస్సున నుదయించును. ప్రశ్న లనేకములు బయలు దేరును. తొంటి మనశ్శాంతి చెల్లా చెదరగును. విశ్వాసము తొలగిపోవును.

విజ్ఞానము వ్యాపింప సాగినపుడు పాశ్చాత్యదేశములలో నిట్టి స్థితి సంభవించెను. విజ్ఞానాన్వేషణమునందు యుక్తి ప్రాధాన్యము వహించుచున్నది. తత్కారణముచే మనుజులు విశ్వాసమునకంటె యుక్తిని విశేషముగా గౌరవింపసాగిరి. ముఖ్యముగా యువజనులు కారణములచే నిరూపింప బడనిది ఏ విషయమును విశ్వసింపరైరి. ప్రతి మత ధర్మమును ప్రతిమతాచారమును వారు శంకింప నారంభించిరి. తద్ధర్మముల యొక్కయు తదాచారముల యొక్కయు కారణముల గూర్చి యోచింప దొడంగిరి. యువజనుల హృదయము సంశయావృత మయ్యెను. దేవుడు ఊహాపరి కల్పితుడనిరి. ఆత్మ మిథ్య యనిరి. మరణాంతర జీవనము సున్న యనిరి. శరీరము వినా మరియేమియు లేదనిరి. దేహసౌఖ్యములే మనుష్యుని పరమావధి యనిరి. బహు శతాబ్దముల నుండి సంఘమును బంధించి యుంచిన యెల్ల ధర్మములను వారు త్రోసిరాజనిరి.

ఈ సంశయ తరంగము ప్రపంచము నందంతటను వ్యాపించెను. పూర్వకాలమునందు వలె గాక యీకాలమునందు వార్తలు వ్యాపించుటకు సౌకర్యము లనేకము లేర్పడియున్నవి. ప్రపంచములో నేమూల నొక నూతన భావము పొడసూపినను అది వాయువేగ మనోవేగములతో నేడు ఎల్లెడల క్రమ్ముకొనుచున్నది. ఒక్క నూతనభావము ఉదయించినను ఒక క్రొత్త సంగతి కనిపెట్టబడినను అది వెంటనే తంతి మూలముననో తీగలేని తంతిమూలముననో విద్యుద్వేగముతో ప్రపంచమెల్ల ప్రాకుచున్నది. ఆవిషయమును గూర్చి వెంటనే పుస్తకములు వ్రాయబడుచున్నవి. అవి అచ్చొత్తి ~~[illegible]~~ ప్రపంచము యొక్క వివిధభాగములకు పంపబడుచున్నవి. రైళ్లు, స్టీమర్లు, తపాలా యేర్పాటులు ఇందుకై విశేషముగా తోడ్పడుచున్నవి. ప్రపంచవ్యాప్తమైన ఆంగ్లభాషలో సమాచారముల నానా ముఖములు వ్యాపింప జేయుటకు మరింతసహాయము చేయుచున్నది. ఈ నానావిధ సాధనముల మూలమునను, పాశ్చాత్య దేశములలో నంకురించి పెంపొందిన ఈ సంశయబుద్ధి మన దేశములో గూడ ప్రవేశించి యువజనుల హృదయమును కలంచి వైచెను. మతనిష్ఠ సన్నగిల్లెను. దైవ విశ్వాసము అడుగంటెను. భజనలును ప్రార్థనలును హేళనపాత్రము లయ్యెను. ఇందు ఆశ్చర్య పడవలసిన దెద్దియు లేదు. యువకుడు ఎప్పుడును ఎచ్చోటను ఇవ్విధముగనే ప్రవర్తించును, మతానురక్తి తగ్గిపోవుట అత్యంత శోచనీయమైనను, యువకుని తూలనాడుట వలన గాని నిందించుట వలన గాని లేశమైనను లాభము లేదు. యువజనబృందమునందు కలిగిన యీ మార్పును జూచి పూర్వాచార పరులు క్రోధావేశ పరవశులైరి. ఇంగ్లీషు విద్యను నిందించిరి. పాశ్చాత్య నాగరికతను దూషించిరి. క్రైస్తవ మతమును, క్రైస్తవ పాఠశాలలను నోరునొవ్వ తిట్టిరి. పాఠశాలలు మూసిపోవలె ననిరి. ఆంగ్ల విద్యను మాన్పింపవలె ననిరి. మన మతమును బోధింపవలె ననిరి. సాధ్యమైనంత వరకు ఇట్టి మార్పుల కొంత కావించిరి. కాని యుగ స్వభావమును మార్ప నెవ్వరి తరము? భావ ప్రవాహమును అరికట్ట మన కెట్లు సాధ్యమగును? అరికట్టితిమి పో కండ్లకు గంతలు గట్టి ఏదో ఒక మార్గమున నడిపించుటలో గొప్పతన మేమి గలదు? ఒక భావమును అంతకంటె ప్రబలతరమైన ఉత్కృష్టభావముచే అడంచి వేయవలెను. యువకులలో గల్గిన సంశయములకు సహేతుకములైన సమాధానముల జెప్పవలయును. అంధవిశ్వాసముపై ఆధారపడియున్న విషయములను హేతువాద సహాయమున నిరూపింపవలయును. హేతువును మించిన విషయములు ఉండిన ఉండుగాక. యుక్తికి ప్రత్యక్ష విరుద్ధములైన విషయములను "నమ్ముము, నమ్ముము" అని ఆదేశించిన ఇక్కాలమున నమ్మువా రెవ్వరు? విశ్వాసము యొక్క ప్రయోజనమును కాదను వారెవ్వరును లేరు కాని మనుజుల స్వతంత్రబుద్ధిని పూర్తిగా ధ్వంసము చేసెడు విశ్వాసము కాలక్రమమున జాతియొక్క క్షీణతకు దారి చేయక మానదు. కావున జనులలో కలిగిన సంశయముల నెల్ల తగిన సమాధానముల చెప్పి తీర్చి దేశమునందు మతానురక్తి మరల తలయెత్తునట్లు చేయవలెను. అడగిపోయిన దైవ విశ్వాసము తిరిగి మొలకెత్తి విజృంభించునట్లు చేయవలెను.

పా. స.

సత్యమేవ జయతే

# ధర్మసాధని

శనివారము, ౧౪, మే, ౧౯౨౧.

## బుద్ధశంకరులు.

—— :o: ——

మొన్న శంకర జయంతి. వైశాఖ శుద్ధ పౌర్ణమి (౨౧-౫-౨౧) బుద్ధజయంతి. ఈ రెండు దినములు మహా పవిత్రదినములు బుద్ధుడు, శంకరుడు గొప్ప మతసంస్కర్తలు. హిందూమతమును పరిశుద్ధపరచి సరళత నొందించుటకు వారు విశేషకృషి సలిపిరి.

ప్రపంచము నతీతించిన వారు, విషయ వాసనలనుండి విడివడినవారు మాత్రమె నిష్కామచిత్తులై ధర్మవిచారణ సలిపి సత్యము గ్రహించుటకు సమర్థులు. యావజ్జీవితమును బ్రహ్మచర్యమున గడపి సంసారాసక్తి యేమియు నెరుగని అసామాన్య విరాగి, శంకరుడు. సహజముగ వైరాగ్య స్వభావము గలిగి, సంసారమున ప్రవేశపెట్టబడి దుఃఖమునకు దూరముగ నుంచబడినను ప్రపంచము నందలి శోకము ఏ మాత్రమో సోకినంతనె భార్యను బిడ్డను రాజ్యమును సమస్తమును త్యజించిన అద్భుత త్యాగి, బుద్ధుడు. వారి దృష్టి వైరాగ్యముచే త్యాగముచే నిర్మలమయ్యెను. ప్రాపంచిక వ్యామోహము లన్నియు వారికి పూర్ణముగ తెగిపోయెను. నిశ్చల ధ్యానము చేసి ధర్మము స్వయముగ దర్శించి లోకమునకు ప్రకటించిరి. ప్రపంచము యొక్క అస్థిరత్వము దృఢముగ హృద్గతము చేసికొనక ధర్మమును వెతకుటకు, జీవించుటకు మొదలిడువారు ధర్మము అనుకొనుచు అధర్మములోనె తిరిగి తిరిగి అడుగు పెట్టుదురు. జతేంద్రియుడు, ప్రశాంత స్వభావుడు అయిన వానికె ఈశ్వరాన్వేషణమునందు జ్ఞానము పనిచేయ గలదు. బుద్ధ శంకరు లిరువురు నిగ్రహ శక్తిచే జ్ఞానదీప్తిని బడసిరి.

మతము కర్మాడంబరమున దగుల్కొని తీక్ష్ణమగు ధర్మనిరతనె గోల్పోవును. కర్మ ధర్మజీవనమునకు సాధనము మాత్రమె. అది మరచి కర్మమె ధర్మమని తలంచు దురవస్థకు మానవుడు వచ్చుట తటస్థించును. కర్మ కలాపము పెరిగి ప్రేమ, నీతి అడుగంటిన కాలమున బుద్ధుడు అవతరించెను. అందరు ఈశ్వరుని పేరు చెప్పువారె; పూజా పురస్కారములు సదా సలుపువారె. కాని మానవుని యెడ న్యాయము, జీవులయెడల దయ ఎవరియందు గానబడదయ్యెను. సంఘమంతయు హింసామయముగ నుండెను. నిరంకుశత్వము అణచి మానవ సమానత్వము నెలకొల్పుటకు, సర్వవిధములగు క్రౌర్యము నిర్మూలించి అహింసా ధర్మము స్థాపించుటకు బుద్ధుడు కారకుడయ్యెను. అహింసామహిమను భారతవర్షమున ప్రథమమున కనబరచిన మహాత్ముడు బుద్ధుడు. మానవుని జీవితమంతయు అహింసపై, ప్రేమపై నిర్మింపబడవలె ననియె యాతని ముఖ్యోపదేశము. శుష్క కర్మలుగాక పారిశుద్ధ్యమె, ప్రేమయె మతము అని ఆతడు అనేక విధముల బోధించెను. ఈశ్వరు డనుచు ఆకాశమువంక చూడక భూతదయగలిగి మానవసేవ సేయుటయె మానవుని విధియని యాతడు తెలిపెను.

ప్రపంచ జీవితమును పరిశుద్ధ పరచుకొనుట యందు మతము గలదనుట వాస్తవము. పవిత్రజీవనము బడసి పెంపొందుటకు మానవుడు పవిత్రస్వరూపుడగు ఈశ్వరునియందు ప్రతిష్ఠితుడగుట యావశ్యకము. వృక్షమునకు భూమి యెటులనో ఆత్మకు ఈశ్వరు డటువంటి వాడు. బుద్ధుని బోధవలన సద్వర్తనమునె లక్ష్యముగ బెట్టుకొనినను పలువురు నాస్తికులు కాజొచ్చిరి. ఈశ్వర విశ్వాసముతో మతమునకు సంబంధము లేనటు లాయెను. తర్కవిచారణ అధికమై ఈశ్వరాస్తిత్వము ఎగురగొట్టబడు చుండెను. సహేతుకముగ అస్తిత్వమును నిలుపగల తత్వవేత్తకొరకు దేశము ఎదురు చూచుచుండెను. శంకరు డుదయించెను. బౌద్ధధర్మమందలి యుత్కృష్ట విషయములన్నియు స్వీకరించి ఈశ్వర విశ్వాసమును తన యసాధారణ మేధాశక్తిచే మరల పాదుకొల్పెను. తన వాదమును సామాన్యజనులలో నెటులనైన వ్యాపింప జూచు కొనక

అన్యమత గురువుల యొద్దకు బోయి వారి వాదముల ఖండించువాడు. హిందువులలో ప్రబలిన సౌరమతము, చాంద్రిమతము, పాశుపతమతము, గాణాపత్యము మొదలగు వివిధదేవతోపాసకుల మతములను

న తస్య సూర్యోభాతి న చంద్రతారకం
నేమా విద్యుతో భాంతి కుతోయ మగ్నిః
తమేవ భాంత మను భాతి సర్వం
తస్య భాసా సర్వ మిదం విభాతి॥

మున్నగు వేద వాక్యములచే ఖండించి శుద్ధాద్వైతమును ప్రతిష్ఠించెను. హేతుజ్ఞానము ప్రబలి సంశయ వాదములు బయలుదేరి నప్పుడు, సంశయములు తీర్పగల మేధావియై శంకరుడు తన వివాదము నందు దిగ్విజయము గాంచెను. ఆస్తిక్యము తిరిగి విజృంభింప నాగెను.

అహింసా దీక్షయు, ఈశ్వర విశ్వాసమును మన ప్రకృత జాతీయ జీవనమునను అత్యంతావశ్యకములుగ నున్నవి. మన సమస్తోద్యమములు వానిపై నెలకొల్ప బడవలసి యున్నది. కాన బుద్ధశంకర జయంతులు శ్రద్ధతో దేశీయులు జరపుచు వారి యుపదేశముల ననుసరింతురు గాక!

---

# వృద్ధయువకుడు.

జేమ్సు కార్డినల్సు గిబ్బన్సు అమెరికా దేశములోని రోమను కాతలిక్కుల మతగురువులలో నొక ముఖ్యుడు. ఉదార స్వభావుడు, నిష్కళంక దేశాభిమాని. ఇటీవలనె మరణించెను.

కడు వృద్ధుడగు వరకు జీవించినను, అంత్యదినమువరకు యువకునివలె నుత్సాహపూరితుడై యుండెను. యువకులతో సదా యెక్కువ సహవాసము చేయుటయె తన నిత్యోత్సాహమునకు కారణమని ఆతడు తెలిపెను. యువకులతో సహవాసము చేయుట తమ గౌరవమునకు లోటు అని తలంచు పెద్దలు గిబ్బన్సు చర్యను పరికింప గోరుచున్నాము.

---

# ఆత్మసామ్రాజ్యము.

మానవుడు ప్రపంచమునందు జనన మొందెను. కన్నులు విచ్చి పారజూచెను. నలువైపుల నుండియు సుందరధ్వను లాతని నాహ్వానము చేయ జొచ్చినవి. ఇటునటు తిరుగాడ నారంభించెను. ఈ స్నేహితుల దగ్గరకు, ఆ బంధువుల దగ్గరకు ఈకొండల వైపునకు ఆమిట్టల వైపునకు తిరుగ నారంభించెను. హృదయమున మాత్రము శాంతి లేకపోయెను. ఈ బంధువుల యొక్క ఆదరణలు ఆ స్నేహితుల యొక్క సరస సల్లాపములు ఆతనిని సంపూర్ణముగ శాంతిపరుప లేక పోయెను. ఏదియో ఒకటి లోపించినట్లు కనబడజొచ్చెను. అదియే తనకు శాంతి నిచ్చునట్లు తోచుచుండెను. దానియందే తన సంపూర్ణ ఆనందమున్నట్లు తనకు పొడగట్టుచుండెను. కాని అది యేదియో తెలియదు. దాని రూపమేదియో తెలియదు. ఏ దారిని ప్రయాణముచేసిన కనబడునో తెలియదు. తుదకు కనకడునో కనబడదో కూడ తెలియదు. ఆరాటము మాత్రము అధికమగుచున్నది. దారి తెన్ను గానక కొట్టుకొనుచుండెను. పోనీ! ఉన్నచోటనే ఉండెదమన్న హృదయమునందుండు అశాంతి ఉండనీయదు. పరుగులెత్తించుచున్నది నడు, నడు, నీ అశాంతి చల్లపడు చోటున్నదని చెప్ప జొచ్చినది. ఆవాణిని పట్టుకొని నడువజొచ్చెను. ఈవైపునకు, ఆవైపునకు పోయెను. కొండలమీదకు బోయెను. గుళ్లదగ్గరకు బోయెను. గోపురముల దగ్గరకు బోయెను. తీర్థయాత్రలు సేవించెను. పుణ్య నదులలో స్నాన మాచరించెను. సంతర్పణలు సమారాధనలు చేసెను. కాని హృదయ అశాంతి తగ్గలేదు. కలుగవలసిన సంతుష్టి కలుగలేదు. అయిన చోట్లకు కాని చోట్లకు తిరిగెను. తన సంబంధము లేని స్థలముల విసుగు విరామము లేక వెదకుకొన జొచ్చెను. కాని కనుపింపలేదు, నిరాశ జెందెను. నేల చతికలబడెను. అయ్యో, ఎట్లు రా బ్రతుకునది. ఏది త్రోవయని విలపింపజొచ్చెను. మరల అయ్యో, పిచ్చివాడా! నీ కేమి భయము. నీ బంధువులున్నారు. నీ స్నేహితులున్నారు. నీ గృహారామము లున్నవి. సమస్త సంపదలున్నవి. అని కన్నులను గొలుపు ప్రపంచమును జూచెను. కొంచెము తెలివి తెచ్చుకొనెను, కాని నీ కివేల యని పెద్ద ధ్వని లోపలనుండి వినవచ్చెను. గుండె గుభేలుమనియెను. అశాంతి తిరుగ కోటిరెట్లు అధికమయ్యెను. ఇక ప్రాణము పోవునట్లుండెను. నేలమీద పరుండెను. కన్నులను మూసికొనెను. సమస్త ప్రపంచమును మరచి మహాదుఃఖములో నుండెను. ఆ సమయమున "నాయనా, ఏడ్చుచున్నావా, నేను నీదగ్గర నుండగనే" అనిన ధ్వని వినిపించెను, దేహము చెమటలు గ్రమ్మెను. పట్టరాని సంతోషము కలిగెను. "అమ్మా, నీ విక్కడనేయుంటివా" యని కౌగలించుకొనెను. బిగ్గరగా నేడువ నారంభించెను. అయ్యో, తల్లీ, నీ కొరకు ఎంత వెదకుకొంటినే యని చెప్పలేక చెప్పుచు వెక్కి వెక్కి యేడువ జొచ్చెను. 'నాయనా! భయములేదు. ఆగుము. నన్ను తేరి పారజూడుము. నీ సమస్త భయములును తీరిపోవును. నీ శంకలు తీరిపోవును' అని ఆధ్వని చెప్పబోయెను. కన్నులను మూసికొనెను. ప్రపంచమును చూడలేకపోయెను. ధన్యుడనైతిని, ధన్యుడనైతిని అని కేకలు వేసెను.

అయ్యో, ఎంత భ్రమలో పడితిని ఎన్నెన్ని దూరప్రదేశముల కేగితిని, ఎంతెంత కష్టమును పడితిని. అయ్యో, నా దగ్గరనే యుండి నా వెనువెంట తిరుగుచున్న నా మాతను కనుగొనలేక భయము చెందితిని. అడుగరాని వారి నడిగితిని. చేయరాని పనులను జేసితిని. నా సామ్రాజ్యము నాలో నున్నదని గుర్తింపలేక అవిశ్వాసముచే యాచనావృత్తియందు ప్రవేశించితిని. సంతుష్టి కలుగక పోయెను. బాహ్య ప్రపంచమున చూడ దలచితిని. అయ్యో,

ఈ అవిశ్వాసముచే నెంత మోసపడితిరి. నా కిక భయములేదు. నా మహా సామ్రాజ్యము నా కున్నయది. ఏ అవస్థలోను నన్ను వీడదు. సమస్త శుభములను ప్రసాదించును. సమస్త శస్త్రులను ఒసంగును. ఆహా! ఆత్మ సామ్రాజ్యమే కదా మానవులను, సంఘములను, దేశములను లేవనెత్తునది. అది లేకపోయిన భౌతికసంపద లెన్ని యుండినను ఏమి ప్రయోజనము. ఏమి శాంతి. అవి యే విధమున నిలువగలవు. అని చెప్పుకొనుచు లేచి గంతులు వేయ నారంభించెను. మరల ప్రపంచము నైపునకు చూచెను. ప్రపంచము నూతన విధముగా కనుపించెను. ఎక్కడ చూచినను ఆనందమే. ఎక్కడ చూచినను శాంతియే. ఈ భౌతిక సంపదలన్నియు తన సామ్రాజ్యమునం దిమిడియుండుటను జూచెను. పూర్వపు స్థితి కనబడనే లేదు. ఆహా, అట్టి ఆత్మ సామ్రాజ్యమే, స్వరాజ్యము. ఆ స్వరాజ్యమును పొందుటకే భారతీయులు ప్రయత్నించుచున్నారు. ఆ స్వరాజ్య తత్వము నే ప్రపంచమునకు బోధింప తలపెట్టినారు. ఇన్ని దినములు ఎక్కడనో లభించుననుకొంటిరి. వీరిని వారిని యాచింప మొదలు పెట్టిరి. ఇచ్చిన దానితో సంతుష్టి లేకపోయినది. ఇవ్వలేదని దూషింప మొదలు పెట్టిరి. నిరాశ చెందిరి. కాని హృదయమున ఆ నిరాశయందు దేదీప్యమైన కాంతితో మహాలక్ష్మి తాండవమాడుటను చూచి వెంట పరుగులెత్తుచున్నారు. ఆ మహాలక్ష్మియే భారత దేశము యొక్కయు ప్రపంచము యొక్కయు, దుర్దశను తొలగింపగలదు. మానవులారా, కన్నులు విచ్చి చూడుడు, ఆత్మ సామ్రాజ్యమును. ధన్యులు కాగలుగుదురనెడి మహావాణి భారతదేశమునుండి సమస్త జాతులకును వినిపించుచున్నది.

త. న. శ.

---

# కేనోపనిషత్తు.

—:o:—

[ శ్రీ ఆదెపూడి సోమనాథరావుగారు. ]

## ప్రథమ ఖండము.

గీ. ప్రాణమానసములఁ దమ పనులయందు
వీనుగన్నులఁ దమతమ విషయమందు
వాక్కు నెంతయు దాని వ్యాపారమందు
వింతగాఁ గొల్పుచుండెడు వేలు పెవఁడు.

గీ. అనుచు జిజ్ఞాసువగు శిష్యుఁ డడుగఁ గానె
యతని యాసక్తి కెంతయు నాత్మ మెచ్చి
చక్కగా బోధపడునట్టి చందమునను
బ్రహ్మ విదుఁడగు ఋషి యిట్లు పలుకఁ దొడఁగె.

గీ. కంటికిం గన్ను కర్ణంపుఁ గర్ణమనుచు
వాక్కునకు వాక్కు ప్రాణంపుఁ బ్రాణమనుచు
మనసునకుఁ గూడ బ్రహ్మమే మనసటంచుఁ
దేట తెల్లంబుగాను సద్ధీరు లెఱిఁగి
యమృతులై యుందు రిహలోక యాత్ర వీడి.

గీ. కనులు వాక్కునుగాని యీ మనసు గాని
కనుఁగొనఁగ లేని బ్రహ్మముఁ గాంచు టెట్లు
దివ్యబ్రహ్మ స్వరూపముఁ దెలియ కుండఁ
దెల్లముగ శిష్యకోటికిఁ దెలుపు టెట్లు?

గీ. కానఁబడు జగతి కంటెను గానరాని
కారణము కంటెఁ గూడను వేరుగాను
వెలయు నా బ్రహ్మమని తొంటి పెద్దలెల్లఁ
బలుకు చుండంగ వినియున్న వారము గద.

గీ. వాక్కులెద్దానిఁ దెలుపంగ వలను పడదొ
వాక్కులెద్దాని చేతను బ్రకటితములొ
యదియె బ్రహ్మమ్ము తదితర మైనయట్టి
దేదియును గూడ బ్రహ్మమ్ము గాదు వత్స.

గీ. మనసునకు దేనిఁ దెలియంగ ననువు కాదొ
దేని చే నన్యముఁ మదిఁ దెలియఁ గలదొ
యదియె బ్రహ్మమ్ము తదితర మైన యట్టి
దేదియును గూడ బ్రహ్మమ్ము గాదు వత్స.

గీ. కనులు దేని స్వరూపముఁ గానలేవొ
కన్ను లెద్దానిచేతను గాంచఁ గలవొ
యదియె బ్రహ్మమ్ము తదితర మైన యట్టి
దేదియును గూడ బ్రహ్మమ్ము గాదు వత్స.

గీ. వీను లెద్దాని వినుటకు విలుగాదొ
వీనులెద్దాని చేతను వినఁ గలుగునొ
యదియె బ్రహ్మమ్ము తదితర మైన యట్టి
దేదియును గూడ బ్రహ్మమ్ము గాదు వత్స.

గీ. తలఁపఁ బ్రాణమ్ము దేని కాదరువు కాదొ
ప్రాణ మెద్దానిచేతను బ్రాణ మగునొ
యదియె బ్రహ్మమ్ము తదితర మైన యట్టి
దేదియును గూడ బ్రహ్మమ్ము గాదు వత్స.

ఇది ప్రథమ ఖండము.

సమాప్తము.

---

**The Dharma Sadhani Press,**

COCANADA.

***All Kinds of Job work***

***in***

**English & Telugu**

***Promptly and Neatly***

***executed.***

## యోగము.

పరోక్షము: అపరోక్షము.

ధర్మజీవనమునకు తోడ్పడు ఉత్తమ గ్రంథరాజము.

భక్తాగ్రేసరులు.

బ్రహ్మానంద కేశవచంద్రునిచే

విరచితమగు

సుప్రసిద్ధ గ్రంథమునకు

ఆంధ్రీకృతము.

వెల **0-2-6**

పోస్టుద్వారా పంపగోరువారు **0-3-6** పోస్టు బిళ్లలు ఈ క్రింది విలాసమునకు పంపవలెను.

ధర్మసాధనీ కార్యస్థానము,

కాకినాడ.

## కేసరి—పత్త్రత్రయము.

### లోధ్ర.

గర్భాశయ రోగనివారిణి.

స్త్రీలకు గలుగు బహుకష్టాలు, బహిష్టు కాకుండుట, ఆకాల బహిష్టి, మైల జాస్తిగాను, తక్కువగాను పోవుట, కడుపు రోగము, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధకము, సూతికా రోగము, కీళ్ళ నొప్పులు, అతికాళ్ళు, అరచేతులు మంట మొదలగు స్త్రీసుఖ్య వ్యాధులను కుదుర్చును. 24. ఔ రు. 5. 12 అవుస్సుల బుడ్డి రు 3-0-0. 6 అవుస్సుల బుడ్డి రు 1-10-0.

### అమృత.

రక్తశుద్ధి ద్రావకము.

ఇది రక్తహీనత, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, నిస్త్రాణ, కడుపుబ్బు మంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతి సుఖమునకు తేజస్సును యిచ్చును. 24. అవుస్సులు రు 5. 12అవుస్సులు బుడ్డి రు 3-0-0. 6 అవుస్సుల బుడ్డి రు 1-10-0.

### అర్క.

సర్వజ్వర నివారిణి.

వాత, పిత్త, కఫ, విషమ, సన్నిపాతకొండ, మన్యసమస్త జ్వరములు జ్వరబిళ్ళ విషపడిశ మహాశ్చర్యముగ కుదుర్చును. 6 అ రు 2-8-0; 3 అ రు 1-8-0; 1 అ 0-8-0.

కేసరికుటీరం, ఆయుర్వేద ఔషధశాల,

ఎగ్మోర్, మదరాసు.

# P. SUBBA ROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

## పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళ సన్నిధి, తంజావూరు.

వస్త్రములకు వేయు సువాసన ద్రవ్యములు:—మన మోహిని మనోరంజని, జగన్మోహిని, మదనవిలాసము, అక్బర్ చిరాయి, షాజిహాన్, చిరాయి అని ఆరు విధములయిన వాసనలున్నవి వీటిలో నొక్కొకటిని ఇప్పుడె పుష్పించిన పుష్పములవలెనే సువాసనగలవి. దినుసు 1 కి బుడ్డి 1 కి అ. 8, వి. పి. శెలవు 1 మొదలు 6 సీసాలవరకు అణాలు 8 ప్రత్యేకము.

కేసరి పవుడర్:—ఇది యొక విధమయిన ధరగల మేలయిన సుగంధ మిశ్రమము ఇందులో కొంచెము యెత్తి నీళ్ళలోనైనను మంచి శ్రీగంధమునందు గాని చేర్చి శరీరమునకు పూసిన యెడల ~~[illegible]~~వల్లను మెప్పించెడు సువాసన యిప్పించును. వివాహము మొదలగు సకల శుభములకును దీని తప్పక అవశ్యం ఉపయోగించవలెను, దీనియొక్క సౌలభ్య పరిమళమును అనుభవించిన వారికే తెలియవచ్చును. గంధములో యీ శ్రేష్ఠమైన మిశ్రమము చేర్చిన యెడల అత్తరు పన్నీరు కుంకుమపువ్వు మొదలగు వాసనద్రవ్యములు చేరవలసినది లేదు. వెల సీసా 1 కి అణాలు 8, 1 మొదలు 5 సీసాలవరకు వి. పి. శెలవు అణాలు 8 ప్రత్యేకము.

### బొల్లికి మందు.

పైన పూయవలసినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లగా పనిచేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి. చార్జి 8 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధములయొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

## అమృతాంజనము.

సుందరమైన **1921** ఉపయోగమైన

## క్రొత్తక్యాలండరు

విక్రియమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0-4-0 వి. పి. ఖర్చులు సహా 0-6-0

వెంటనే వ్రాసుకొనవలయును.

| తామర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0-6-0 | డబ్బి 1 కి, 0-2-0 | సీసా 1 కి, 0-12-0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు,
బెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బీతో సహా వెల రూ. 0-10-0. డజన్ 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేఱు.

## అమృతాంజనము డిపో,

౧౦౯, ఫేరిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మదరాసు.

శ్రీమాన్ వైద్యరత్న పండిత
డి. గోపాలాచార్లుగారు స్థాపించిన

## ఆయుర్వేదాశ్రమము.

41, ఆచారప్పన్ వీధి. జార్జిటవున్, మదరాసు.

ఇందు, మామూలురీతిగా మందులు విక్రయింపబడును. ప్లేగు, కలరా, ఇన్‌ఫ్లుయెంజా మున్నగు వ్యాధులకు ను. తదితర వ్యాధులకును మందులు దొరకును.

వ్యాధివివరములను వ్రాసిన, మందులు సిద్ధ యించి పంపబడును.

కోరినవారికి క్యాటలాగు ఉచితము.

ఎన్. మాధవమీనన్ (ఆయుర్వేదాచార్య)
తంతి విలాసము } డి. దేశికాచార్యులు,
'పండిట్', మదరాసు.' } జాయింటు ప్రొప్రయిటర్లు.


## ధర్మసాధని.

ప్రకటన పద్ధతి.

| | 1 సం॥ | ½ సం॥ | ¼ సం॥ |
|---|---|---|---|
| 1 కాలము. | రు. 60 | రు. 40 | రు. 24 |
| ½ ,, | ,, 40 | ,, 24 | ,, 16 |
| ¼ ,, | ,, 24 | ,, 16 | ,, 12 |

ప్రకటన ద్రవ్యము ముందుగానే చెల్లింపవలెను.

**Reg. No. M. 1094.**
**The Dharma Sadhani, Cocanada.**

(Printed and Published by K. Hanumanta Rao, at the Dharma Sadhani Press, Cocanada.)

**V. P.** *Rs.* *As.* **To M. R. Ry.**

61 Jayanti Gaganna garu B. A., L. T.,
Head Master, V. H. School,